# శివ

శివ అందమైన అమ్మాయి. తెలివైన విద్యార్థిని. అణకువ గల కూతురు. ఆత్మీయురాలైన స్నేహితురాలు. ఉత్తమంగా బోధించే ఉపాధ్యాయిని. దయా ధర్మ దాన గుణాలున్న గృహిణి, ప్రేమించే స్త్రీ.

శివ మా కాలేజీలో డిగ్రీ చేసింది. కర్నూల్లో బి.ఇడి. చదివింది. వాళ్ళ ఇంటి పక్కనే ఉన్న కాన్వెంటు స్కూలులో టీచరుగా చేరింది. వెంటనే పెళ్ళిచేశారు. మూడేళ్ళయినా పిల్లలు కలగలేదు.

గబగబా పిల్లలు పుట్టాలని శివకు తొందర. ఇప్పుడే పిల్లలెందుకు అంటాడు భర్త. పిల్లలెందుకు కలగటం లేదని శివకు ఆవేదన. భర్తను డాక్టర్లకు చూపించింది. తనూ చూపించుకొంది. ఇద్దరూ పరీక్షలు చేయించుకొన్నారు. ఏ లోపం లేదని డాక్టర్లు చెప్పారు.

శివకు అంతా తొందరే! గబగబా చదివింది. ఏ ఏటికాయేడు పైక్లాసుల్లోకి పోయింది. ఎక్కడా విరామం లేదు. చదువు. ట్రయినింగు ఉద్యోగం పెళ్ళి వెంట వెంటనే జరిగిపోయాయి. అన్ని దశలు ఒకదాన్ని ఒకటి తరుముతున్నట్లు వచ్చాయి. వెంట వెంటనే పిల్లలే పుట్టలేదు.

శివ మాటల పుట్ట. అందరితో కబుర్లే! అబ్బాయిలు లేరు, అమ్మాయిలు లేరు, అందరూ ఫ్రెండ్స్! కొత్తవాళ్ళతో క్షణాల్లో స్నేహం చేసేది. పదేళ్ళ ఫ్రెండ్సులాగా ప్రవర్తించేది.

కాలేజీలో ఎక్కడ చూచినా తానే! క్లాసులో తానే! లైబ్రరీలో తానే! యన్.సి.సి.లో తానే! యన్.యస్.సి.లో తానే! మాటల్లో తానే! ఆటల్లో తానే! పాటల్లో తానే! తాను లేందే కాలేజీ లేదన్నంత హడావుడిగా ఉండేది.

కాలేజీలో చదువుకొనే రోజుల్లో తీరుబడి దొరికితే చాలు, మా ఇంటికొచ్చి వాలేది. కబుర్ల చెప్పేది. క్షణం నోరు మూతపడదు. వాగుడు కాయ.

మా ఇద్దరికొడుకుల్ని బాగా ఆడించేది. పాడించేది. పాఠాలు చెప్పేది. వాళ్ళతో గంతులు వేసేది. ఆయన కేంపుకు పోతే తోడుంటానని ఇంట్లోనే పడుకొనేది. పిల్లల్ని పక్కలో వేసుకొనేది.

నాకు ఆడపిల్లలు లేరన్న కొరత ఏ మూలనన్నా ఉండేదో ఏమో, శివ కూతురు లాగా అనిపించేదో ఏమిటో అదంటే చాలా ముద్దుగా ఉండేది. అది కనిపెట్టిందో ఏమో! 'మేడం నన్ను పెంచుకొండి మేడం- మీకు కూతురులేని లోటు తీరిపోతుంది. సార్ని అడగనా?' అని నానా హంగామా చేసేది.

శివ తండ్రికి అన్నలు ఇద్దరు. ముగ్గురికి పెళ్ళిళ్ళు అయ్యాయి. ముగ్గురు తల్లులు. వాళ్ళది సమిష్టి కుటుంబం. కడ గొట్టు తమ్ముడికి లేకలేక శివ పుట్టింది. ఇక మరి వాళ్ళింట పిల్లలు పుట్టలేదు. ఒక్కతే ఆడపిల్ల! లేకలేక కలిగింది. అది అసలే గారాలపట్టి. అట్లాంటి శివ తనను పెంచుకోమంటుంది. దత్తత తీసుకోమంటుంది. లేదంటే ఇంట్లో ఉండిపోతానంటుంది. దానికెందుకో నేనంటే పిచ్చి ప్రేమ. దీని వెర్రిగాని, నేను పెంచుకొంటానన్నా, ఆ తల్లులూ, తండ్రులూ శివను ఇస్తారా? ఇవ్వరు.

ఆ రోజు రాత్రి పిల్లల్ని ఆడిస్తూ ఆడిస్తూ అట్లాగే నిద్రపోయింది. ఉదయమే నేను కాలేజీకి తయారవుతుంటే, తాను కాలేజీకి సిద్ధమయింది. పనిమనిషి పిల్లల్ని స్కూలుకు తీసుకుపోయింది. నేను చెప్పులు వేసుకొంటూ ఉంటే చటుక్కున వచ్చి నన్ను ముద్దు పెట్టుకొంది. ఒక్క క్షణం బిత్తరపోయాను. ఒక్క నిమిషం ఏమీ అర్థంకాలేదు.

'ఇదేమిటి శివా?' అంటే, 'మేడం ఎంతముద్దొస్తున్నారో!' అంది. అని వూరుకోలేదు. 'అందుకే సారు మిమ్మల్ని కట్నం కానుకలు లేకుండా పెళ్ళిచేసుకొన్నారు' అంది. అంతటితో వూరుకోలేదు. 'ఎవరైనా ఎదురిచ్చి పెళ్ళిచేసుకొని ఉండేవాళ్ళు' అనీ అంది. వాగుడు కాయని చెప్పాను కదా, మాటలు ఆపదు. పిల్లలుంటే వాళ్ళతో కబుర్లు చెప్పేది. వాళ్ళు స్కూలుకు పోగానే మాట్లాడటానికి ఎవరూ లేక నామీదికి మాటల బాణాలు వదులుతూ ఉంది. ఇప్పుడైనా ఏమగవాడు మిమ్మల్ని చూచినా ఈ అమ్మాయిని పెళ్ళాడితే ఎంతబాగుండును అనుకొంటాడు' అంది. 'లెక్చరరు అని తెలియకపోతే కాలేజీలో మమ్మల్ని స్టూడెంట్ అనుకొంటారు' అంది. అంతటి ఆపుతుందా, ఆపదు. 'నేనే మగ పిల్లవాణ్ణి అయితే మీ వెంటపడి తిరిగేవాణ్ణి. పెళ్ళయిందని తెలిసినా, పిల్లలున్నారని చెప్పినా, ఆమె మొగుడు తంతాడని ఎవరైనా వార్నింగు ఇచ్చినా వదలకుండా ప్రేమించాననీ, ప్రేమించమని సతాయించే వాణ్ణి. దేవదాసులాగా, మజ్నూలాగా, మరో భగ్నప్రేమికుడిలాగా, మీ మీద ప్రేమ కవిత్వం వ్రాసి, బొమ్మలు గీసి, పాటలు పాడి, తాగి, తూలి, కుక్కపిల్లకు ముద్దులు పెడుతూ, మేడం, చెప్పలేను' అంటూ మళ్ళీ ముద్దు పెట్టుకొంది.

'శివా' గట్టిగా మందలించాను. దాని మాటలు బాగానే ఉన్నాయి. ముద్దులు బాగా లేవు. 'చాల్లే ఆపు' అన్నాను. ముద్దులు ఆపింది. ఎందుకో చెప్పరాని ఆనందంగా ఉంది. మాటలు ఆపింది. అదంతబాగా లేదు.

'పదవే పోదాం!' అన్నాను. తుర్రున బయటికి వచ్చింది. తలుపుకు తాళం వేసి 'కాలేజీకి ఆలస్యం అవుతాం, రిక్షా ఎక్కుదాం' అంటే 'కాస్త దూరమేకదా మేడం నడుద్దాం' అంది. 'మీతో నడచి వస్తుంటే సంతోషంగా ఉంటుంది' అంది. 'మిమ్మల్ని అందరూ చూస్తుంటారు. పక్కనున్న నన్ను కూడా చూస్తారు. భలే ఛాన్సులే' అంది. 'నీముఖం రిక్షా ఎక్కు' అంటే, 'నా ముఖమేకాదు, మీ ముఖం కూడా చూస్తారు. చెబుతున్నాను. మాట వినటం లేదు. గొప్ప

ఛాన్సు పోతుంది. ఇక మీ యిష్టం. పాపం తోవనపోయే వాళ్ళు దురదృష్టవంతులు. మీ ముఖం చూచే అదృష్టం వాళ్ళకు మీరు లేకుండా చేస్తారు. వాళ్ళ కళ్ళలో దుమ్ము కొడుతున్నారు' అంది. 'ఎక్కవే' అని సరదాకి కసురుకొంటే ఎక్కి దొరసానిలా నడిమధ్య కూర్చుంది. 'జరగనే' అంటే జరిగింది. జరిగినట్లే జరిగి, పక్కకు వచ్చి, కాలుకి కాలు, నడుంకు నడుం, మెడకు మెడ తగిలిస్తూ కూర్చుని 'ప్రియురాలి పక్కనే కూర్చున్నట్లుంటుంది మేడం భుజం మీద చేయి వేయనిస్తే' అంది. 'బుగ్గలు పిండుతా, నోరు మూసుకొని కూర్చో' అన్నాను. శివ మాట్లాడితే వినటం సంతోషమే. రిక్షా డ్రైవరు వింటాడని భయం. శివ ఏమో అనబోతుంటే నోరు మూశాను. మాటలు ఆపింది. 'నీకేమన్నా తిక్కా? నోరు మూసుకొని ఉండలేవూ?' అంటే 'నోరు మూశారుగా' అని గొణిగింది.

శివ పెళ్ళి రోజు దాని మాటలన్నీ గుర్తుచేస్తే చాలా సంతోషించింది.

శీన, శివభర్త, చక్కగా ఉన్నాడు. మంచి ఈడూ జోడూ! మంచి ఉద్యోగం. మేమిద్దరం వేరే ఉంటామంటే తల్లులు, తండ్రులు అయిదు రూంలు కూతురుకు, అల్లుడికి ప్రత్యేకంగా వదిలి, వాళ్ళ ఏకాంతానికే భంగం కలిగించకుండా ఉన్నారు. లంకంత ఇల్లు. పది కుటుంబాలు కాపురం ఉండవచ్చు.

చిలకా గోరింకా అన్నా, చింతపండు జిలకర అన్నా ఏమన్నా ఫరవాలేదు. అతికినట్లు జంట కుదిరింది. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటారే అలా వున్నారిద్దరూ!

శీనాని శివ బంకలా అతుక్కొని ఉండేది. క్షణం వదిలి ఉండేది కాదు. నిద్రపోయినా లేచినా కలిసే అంటే కరెక్టేకానీ, కాఫీ తాగినా, అన్నంతిన్నా ఒకే కప్పు. ఒకే ప్లేటు అన్నా కరెక్టేకాని, బట్ట తీసుకొన్నా, తలదువ్వుకొన్నా ఒకే దువ్వెన, ఒకే చేయి అన్నా కరెక్టేకానీ, బట్టలు విప్పుకొన్నా, స్నానం చేసినా కలిసే అంటే కరెక్టే అనటానికి తల్లులు తండ్రులు ఇష్టంగా ఉన్నా, బంధుమిత్రులు లేరు. ఇరవై నాలుగ్గంటలు వాళ్ళిద్దరూ అతుక్కొనే ఉండేవాళ్ళంటే అతను ఆఫీసుకు పోలేదా, అమ్మాయి కాన్వెంటుకు పోలేదా అని ఎవరూ అడిగేవాళ్ళు కాదు.

శివ శీనాలు మూడు కుటుంబాలకూ సరిపడా పిల్లల్ని కనాలని, తల్లులు తండ్రులు, యమ తాపత్రయ పడిపోతున్నారు. ఇంటినిండా పిల్లల్ని కనాలంటే శివా సిద్ధమే. శీనా సిద్ధమే. ఎందుకో ఏమిటో ఆలస్యం అయిపోతూ ఉంది.

అమ్మలకు నాన్నలకు అనుమానం మొదలయింది. తమకు మరి సంతానం లేనట్లే. వంశపారంపర్యంగా వచ్చే ఆనవాయితీ ప్రకారం శివకూ పిల్లలు కల్గరేమోనని బెంగ పట్టుకొంది.

నాకు విజయవాడ బదిలీ అయి వెళిపోతున్నప్పుడు శివ, శీన ఇద్దరూ స్టేషన్‌కు వచ్చి సాగనంపారు. ఝా ఆయనకు ముందుగా విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయింది. భర్త ఉన్నచోటుకు భార్యకు బదిలీ చేయాలని అర్జీ పెట్టుకొంటే ట్రాన్స్‌ఫర్ అయింది. నేను రైలెక్కాక కిటికీ దగ్గరకు వచ్చి, 'భర్తను వదిలి ఉండలేని బంక' అని నన్నంటారు కానీ మేడం, ఇంత వయస్సు వచ్చినా

భర్తను క్విక్ ఫిక్స్ వేసి అతికించుకొని, అటు సారుకు బదిలీ కాగానే ఇటు కాగితాలు మీద కాగితాలు అర్జీలుగా పంపి, మీరు మాత్రం ఉరుకులు పరుగులమీద సార్ దగ్గరకు చల్‌మోహన రంగా అనటం లేదా మేడం?' అంది. మొట్టికాయ వేద్దామనే లోపల రైలు బయలుదేరి, దెబ్బ తప్పించుకొంది. రైలు పోయిందాకా చేతులు ఊపుతూనే ఉంది. దాని కళ్ళలో కళా, కన్నీటి చారా, నేను మర్చిపోలేకపోయాను.

శివ ఫోనులో మాట్లాడుతూ ఉండేది. ఉత్తరాలు వ్రాసేది. ఒకసారి నలభై పేజీల నోటు బుక్కు తీసుకొని లేఖ వ్రాసింది. మళ్ళీ మూడేళ్ళకు మా యిద్దరికీ అనంతపురం బదిలీ అయితే ఈ బదిలీ శివ కోసమే జరిగిందని నాకు అనిపించింది.

ఈ మధ్య కాలంలో చాలా మార్పులు జరిగాయి.

చాలా కాలం పిల్లలు కలక్కపోవటం వల్లనో ఏమో, కాన్వెంటులో పిల్లల్ని తల్లిలాగా చూచుకోవటం మొదలుపెట్టింది. ఆ ప్రేమ చూచి ప్రిన్సిపాల్ చాలా సంతోషించేది. వాళ్ళకు అన్నం తినిపించేది. చాక్‌లెట్లు ఇచ్చేది. కబుర్లు చెప్పేది. పాటలు పాడించేది. పసివాళ్ళు నిద్రపోతుంటే జోలపాడి నిద్రపుచ్చేది.

పిల్లలు, టీచర్ అనో, మేడం అనో పిలుస్తుంటే అలా కాదు, అమ్మా అనో, మమ్మీ అనో పిలవమనేది. వాళ్ళు అలా పిలిస్తే ముద్దులు వానగా కురిపించి, చాక్‌లెట్లు ఇచ్చి, పిల్లలు పొంగిపోయేట్టు చేసేది.

అంతటితో శివ తృప్తి చెందలేదు. ఆ పిల్లల తల్లి దండ్రుల దగ్గరకు పోయి, పిల్లలతో వాళ్ళతో మాట్లాడేది. పాఠాలు చెప్పేది. ముద్దులు పెట్టేది. వాళ్ళు అమ్మా అమ్మా అనో, మమ్మీ, మమ్మీ అనో వెంటబడుతూ ఉంటే, సొంత తల్లుల సంతోషించినా, లోపలెక్కడో ముల్లు గుచ్చుకొన్నట్లయి మౌనంగా ఉండేవాళ్ళు.

అప్పటి నుంచి మీ పాపను పెంచుకొంటాననో, మీ బాబును సాకుకొంటాననో, తల్లిదండ్రుల్ని అడుగుతూ వచ్చేది. కుటుంబ నియంత్రణ వచ్చాక, ఏ ఇళ్ళలోనూ ఎక్కువమంది పిల్లలు ఉండే పరిస్థితి లేకపోవటంవల్ల, ఉన్న ఒకరిద్దరి పిల్లల్లో ఎవరినో ఒకరిని దత్తత ఇచ్చే అవకాశం లేక కాదనే వాళ్ళు. అంతేకాదు, తమ పిల్లలతో అమ్మా, మమ్మీ అని పిలిపించుకొంటూ ఉంటే, తమ పిల్లలు తమకెక్కడ దూరమవుతారోనని తల్లిదండ్రులు చింతపడేది మొదలయింది. వాళ్ళు అంతటితో ఊరుకోక, కాన్వెంటు స్కూలు ప్రిన్సిపాల్‌తో చెప్పి, శివ టీచర్ మా పిల్లలతో అమ్మా, మమ్మీ అనిపించుకోవద్దని, ఆమెను మరో క్లాసుకు మార్చమని కోరటంతో వ్యవహారం ఎంతదాకో పోయిందని ప్రిన్సిపాల్‌కి అర్థమయింది. జరిగిన పరిణామాలవల్ల, ఎవరూ ఏమీ అనకపోయినా, శివకు పరిస్థితి పరిపూర్ణంగా అర్థమయింది.

పిల్లలు కలగలేదని శివ బాధపడుతుంటే ఇప్పుడే పిల్లల కోసం ఏంతొందర అని శీన అనుకొనేవాడు. ఉత్తర దక్షిణ ధ్రువాలుగా ఉన్న శివ శీనాలు మరింత సంతోషంగానే ఉంటున్నారు.

అయితే పిల్లలకోసం శివ, ప్రేమకోసం శీన అన్యోన్య దంపతులుగానే ఉన్నారు.

నేనిక్కడకు బదిలీ అయివచ్చే దానికి ఏడాది ముందు శీన చనిపోయాడని విని సంచలించిపోయాను. పిల్లల పరీక్షలు, ఆయన కేంపు, సెలవు లేకపోవటం వల్ల నేను చివరి చూపులకుగానీ, దశ దినకర్మకు గానీ రాలేకపోయాను. అంత ఆరోగ్యంగా ఉండే శీన ఎందుకు చనిపోయాడో, ఏలా చనిపోయాడో ఏమీ వివరాలు తెలియదు.

తనను రిసీవ్ చేసుకోవటానికి స్టేషన్‌కు వచ్చిన శివ మామూలుగా ఉంది. దిగులేమీ లేదు. ఆ ఆదివారం రాత్రి నాతోనే ఉండమంటే ఉండనంది. శీనను గూర్చి ఏమీ చెప్పటం లేదు. తాను అడిగితే మానిన పుండును కెలికినట్లవుతుందని భయం కలిగి అడగలేదు.

నేను శివ వాళ్ళ ఇంటికి వెళితే, శీన చెప్పులు బూటులు చూపించింది. శుభ్రంగా పాలిష్‌చేసి ఉన్నాయి. ఏమీ దుమ్ముకొట్టుకోలేదు. పెన్నులు కళ్ళజోడులు చూపించింది. ఇస్త్రీ చేసి మడిచి అలమరాలో పెట్టిన పేంటులు, షర్టులు, పైజామాలు లాల్చీలు బన్నీలు, డ్రాయర్లు సర్దింది. పెళ్ళిఫోటోల, ఊటీ బెంగుళూరు, మద్రాసులలోని హనీమూన్ ఫోటోల ఆల్‌బమ్‌లు చూపించింది.

శీన ముఖంలో తేజస్సు చూడమంది. కళ్ళలో కాంతి చూడమంది. ఆ రూపంలో ఎంత అనురాగం, ఆదరణ, ఆప్యాయత ఉట్టి పడుతూ ఉంటాయో తిలకించమంది.

భర్త బ్రతికి లేకపోయినా, అతడిపట్ల ఆమెకున్న అనురాగం చూస్తుంటే ముచ్చటేసింది. శివను చూస్తుంటే నిజంగా నా కూతురే అనిపించింది. 'నేను పెంచుకొంటాను రావే!' అంటే నవ్వింది. 'దత్తత తీసుకొంటానే' అంటే కిసుక్కున నవ్వింది. 'పెళ్ళి చేసుకొంటానంటే వస్తా'నని నవ్వింది. శివ అలా నవ్వగలగటం నాకు చాలా సంతోషంగా ఉంది 'నేనీ ఇల్లు వదిలి రానం'ది.

ఒకరోజు ఇంటికి వచ్చి, చిన్నతమ్ముణ్ణి తనకు దత్తత ఇమ్మంది. నేను ఏమీ మాట్లాడలేకపోయాను. ఇవ్వలేనుకదా! 'అచ్చం శీనలాగా లేడూ!' అంది. లేడంటే బాధపడుతుందనిపించి ఏమీ మాట్లాడలేదు. ఇష్టమైన వాళ్లందరిలో శివకు శీన కనబడుతున్నాడనిపించింది. 'శీనచాలామంచి మనిషి! ఎంత మంచి మనసో! ఎంత అనురాగమో! ఎంత సుకుమారమో!' అంది. 'నిజమే' అన్నాను.

తల్లులు, తండ్రులు, బంధుమిత్రులు, అందరూ చివరికి అత్తమామలుకూడా శివకు మళ్ళీ పెళ్ళి చేయాలని ప్రయత్నించారు.

'భర్త బ్రతికి ఉండగా భార్యకు మళ్ళీ పెళ్ళా?' అంటూ ప్రశ్నించిందట. ఆమె మనస్సులో అతడింకా సజీవంగా ఉన్నాడని వాళ్ళకు అర్థమయింది.

సంవత్సరం గడిచినాక మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు చేస్తే 'మీకేమన్నా పిచ్చా? నాకెందుకు రెండో మొగుడు?' అని అడ్డం తిరిగిందిట.

శివకి పాతికేళ్ళు దాటినా, భర్తతో నాలుగేళ్ళు కాపురం చేసినా, పసిపిల్లలాగే ఉంటుంది. పసిపిల్లల మనస్తత్వం. పసిపిల్లల మాటలు. చేతలు.

రాత్రి తనతో ఉండమంటే 'ఉండ' నంది. 'పెళ్ళయిన యువతిని, కూతురయినా, చెల్లెలయినా, రాత్రి భర్తకు దూరంగా ఉండమని అడగకూడ'దంది. వెళుతూ, 'నేను వేరే ఇంటిలో ఉంటే ఆయన ఏమనుకొంటాడు?' 'ఆయనంటే మీ నాయనా?' అని అడిగితే, 'ఆయనంటే, మేడం, మీకేమో మీ భర్త, నేను ఆయనంటే నాకేమో మానాయన! బాగుంది మేడం వరస!' అని వెళిపోయింది.

శివధోరణి నాకు కొంచెం వింతగా ఉన్నమాట నిజమే!

శివ ఎవరినైనా ప్రేమిస్తుందా అని సందేహం కలిగి అడిగితే 'ప్రేమాలేదూ దోమా లేదూ, పెళ్ళయిన స్త్రీకి మళ్ళీ ప్రేమలేమిటి?' అని దీర్ఘాలు తీసింది.

మళ్ళీ పెళ్ళికి ఇష్టపడటంలేదు. ఎవరినీ ప్రేమించటం లేదు. పాతికేళ్ళ పసిది! అన్యాయంగా అనిపిస్తుంది.

శివ తల్లులు తండ్రులకు నేను బ్రహ్మాస్త్రంగా కనిపించాను. నన్ను ప్రయోగించాలని చూశారు. నేనే దాన్ని పెళ్ళికి ఒప్పించాలని అనుకొంటున్నాను. వాళ్ళ దృష్టీ అదే!

ఒక ఆదివారం, పిల్లల్ని ఆయన్ని చూచుకోమని చెప్పి శివదగ్గరకు వెళ్ళాను. తమకిచ్చిన అయిదు గదుల్లో తానొక్కతే ఉంటూ ఉంది.

తనే వంట చేసింది. చక్కగా వడ్డించింది. తోడు కూర్చోమంటే కూర్చోలేదు. ఫేను వేసింది. అయినా విసనగర్ర తీసుకొని విసరసాగింది. గలగలా మాట్లాడుతూనే ఉంది. కబుర్లు చెబుతూనే ఉంది. చిలకపలుకులు, తీయగా ముద్దుగా ముచ్చటగా మురిపెంగా శీనను గూర్చి చెబుతూనే ఉంది.

తాను తినటానికి కూర్చున్నప్పుడు తనకు నేనే వడ్డించాను. వద్దంటున్నా కొసరి కొసరి వేసి తినిపించాను. నేను కబుర్లు చెప్పాను. 'సారునుకూడా ఇట్లా కబుర్లు చెప్పే బుట్టలో వేసుకొన్నారు కదా మేడం' అంది. 'బుట్టాలేదు, తట్టాలేదు తినవే' అన్నాను. మౌనంగా తింది. నా డ్యూటీ ఉండనే ఉంది. బ్రహ్మాస్త్రం డ్యూటీ!

'పెళ్ళి చేసుకోవే! మంచి సంబంధం. నాకు నచ్చాడు. నేను చూశాను. వెళదామంటే వెళ్ళి చూచి వద్దాం. కాదంటే రమ్మని పిలిపిద్దాం! ఏమంటావు?' అని అడిగాను. మీ యిష్టం' అంటుందని ఆశ పడ్డాను.

'మీరుచేసుకొంటారా?' అంది.

'పోనీ నన్నే చేసుకోవే!' అంటే గలగలా నవ్వింది.

'ఏం చేసుకొంటారులే మేడం' అని మళ్ళీ పగలబడి నవ్వింది. 'నేనడిగింది నన్ను

చేసుకొంటారా' అనికాదు, మంచి మగవాడిని, ఈడూ జోడూ కుదిరేవాడిని అన్నివిధాలా యోగ్యుణ్ణి చూస్తాను చేసుకొంటారా అని' అంది.

'అదేమిటే? నేనెట్లా మరో పెళ్ళి చేసుకొంటానే! మీ సారుతో నా పెళ్ళి అయిపోయింది. పిల్లలు పుట్టారు. మళ్ళేం పెళ్ళే?' అన్నాను.

'అమ్మా! మీ అల్లుడుండగా నాకు మళ్ళీ పెళ్ళేమిటమ్మా?' అంది.

నా గుండె కలుక్కుమంది శివ నన్నెప్పుడూ అమ్మా అని ఎరుగదు. మేడం అంటుంది. అందగత్తెనంటుంది. పెళ్ళి చేసుకొంటానంటుంది. ఎవరయినా పెళ్ళి చేసుకోవటానికి ఎగబడి వస్తారంటుంది. ఆ శివ నన్ను అమ్మా అంది. నాకెందుకు చెప్పరాని సంతోషం కలిగింది.

అమ్మా అని నా నోరు కట్టేసింది.

'స్త్రీ జీవితంలో పెళ్ళి ఒకసారే! ఒకరితోనే!' అంది. ఎంతో బతిమాలాను. పెళ్ళికి ఒప్పించలేకపోయాను.

ఒకనాటి నా విద్యార్థిని. నేటి నా కూతురు. పైగా ఆధ్యాపకురాలు. ఈ శివ నా మాట వినదు.

శివకష్టం శివదే! అది నాకు తెలియదు. శివ అనుభవం నాకు లేదు. జీవితం విచిత్ర కోణాలనుంచి చూచింది.

'నేను మరో పెళ్ళి చేసుకొంటే ఆయనేమనుకొంటాడు?' అని ప్రశ్నించింది.

'ఏమీ అనుకోడు. పైగా ప్రోత్సహిస్తాడు' అన్నాను.

'నేను పెళ్ళి చేసుకొని పరాయి మగాడితో వెళ్ళిపోతే శీనకు భార్య ఎలా?'

'అదేం ప్రశ్న?'

శివ నవ్వింది. పసిపిల్లలా నవ్వింది. అందంగా నవ్వింది. ఆరిందలా నవ్వింది. విషాదంగా నవ్వింది. 'మీకు తెలియదమ్మా! శీనకు నేనంటే పిచ్చిప్రేమ' అంది.

'ఏం మాటలవ్వి శివా?' అన్నాను.

'ఇది చూడండమ్మా' అంది. బుగ్గచూపించింది. ఎర్రగా కమిలిపోయి ఉంది. 'దోమ కుట్టిందా?' అడిగితే కాదు శీన' అని నవ్వేసింది.

నాకు భయం కలిగింది. శివ అనుభవం ముందు నా వయస్సు చిన్నదయింది. నేను చూడని జీవిత పార్శ్వం శివచూచింది. నేను దిగని లోతుల్లోకి తనకూతురు దిగింది. నాకు అంత బట్టని అగాధం ఆమె దాటింది.

ఒక రోజు శివ కన్నతండ్రి వచ్చాడు. మనిషి దిగులుగా ఉన్నాడు. ఏడుపు ఒక్కటే తక్కువ!

'శివను నువ్వే కాపాడాలి తల్లి' అని అర్థించాడు.

'ఏమయింది?' అన్నాను.

'శివకు పిచ్చి పట్టింది!'

వెంటనే బయలుదేరి అతడివెంట వెళ్ళాను. నాకు చాలా కంగారుగా ఉంది.

ఇంటికి వెళ్ళేసరికి టి.వి. చూస్తూ కూర్చుంది. నన్ను చూచి, లేచింది, నవ్వింది. ఎగిరి గంతులేస్తూ కాఫీ తెచ్చి ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

శివ కాఫీ కప్పు లోనపెట్టి రావటానికి పోయినప్పుడు కన్నతండ్రిని అడిగాను 'శివ మామూలుగా ఉంది. పిచ్చేమిటి'

కన్నతండ్రి కన్నీరు కళ్ళలో కుక్కుకొంటూ 'పిచ్చేనమ్మా' అన్నాడు.

'పిచ్చేమిటి? మామూలుగానే ఉందికదా!' అన్నాను.

'అలాగే ఉంటుంది కానీ, నిజానికి పిచ్చే! హాస్యానికి అంటుందేమో అనుకొన్నాము. అదికాదు. నేను గర్భవతిని అంటుంది. భర్తలేడు. శివ గొప్ప శీలవతి. కడుపు వచ్చింది అంటే పిచ్చికాదా?

'శివా! ఎన్నో నెలే?' అంటే తడుంకోకుండా 'నాలుగోనెల' అంది. మామూలుగా అంది. సాదాసీదాగా చెప్పింది.

శివతో కాన్వెంటు స్కూలుకు వెళ్ళాను. టీచర్, మేడం, అమ్మా, మమ్మీ అంటూ పిల్లలు ఆమెను చుట్టుకొని చుట్టుకొని తిరుగుతున్నారు. శివను పిల్లల్ని చూస్తుంటే ముచ్చటవేస్తూ ఉంది. పాఠం చక్కగా చెబుతూ ఉంది. పిల్లలు అల్లరిలేకుండా శ్రద్ధగా వింటున్నారు. పిల్లలతో శివ ఆడుతూపాడుతూ ఉంది. టీచర్లు, సిష్టర్లు, మదరూ అందరూ శివతో ఆప్యాయంగా ఉన్నారు.

శివకు పిచ్చుంటే ఎవరూ నమ్మరు. పిచ్చికాకపోతే ఆమె మాటలకు అర్థం ఏమిటి? నాకు సందేహం బయలుదేరింది. శివకు అక్రమ సంబంధం ఏదో ఉండి ఉంటుంది. చెప్పటం లేదుకానీ, నెలతప్పటం ఏమిటి?

ఆ సాయంకాలం శివను వెంటబెట్టుకొని డాక్టరు దగ్గరకు పోయాను. ఎన్నో నెలో చెప్పమన్నాను. ఆమె చాలా జాగ్రత్తగా అన్ని పరీక్షలూ చేసి నెలతప్పలేదంది. సందేహం తీరక సెకెండ్ ఒపీనియన్ కోసం మరో డాక్టరును కలిసి శివను చూపించాను. ఆమెకూడా అదేమాట ఖరారు చేసింది.

నేను చేస్తున్న ప్రయత్నం అర్థంకాకపోవటానికి శివ చిన్న పిల్లేంకాదు. 'నాకు ఎన్నో నెలో తెలుసుకొందామనే కదా మేడం మీ ప్రయత్నం. నాలుగోనెల! అమ్మా నాకు నాలుగోనెల! ఈ డాక్టర్లు నాకు నెల తప్పలేదనే చెబుతారు. వీళ్ళకేం తెలియదు. నాకు తెలుసుకదా! నెలతప్పింది.

నాలుగోనెల!'

ఏమయినా అనారోగ్యంవల్ల పీరియడ్స్ ఆగిపోయాయేమోనని ఊహించాను. పీరియడ్స్ క్రమంగా ఉన్నాయని విని ఆశ్చర్యపోయాను.

నేనేమీ మాట్లాడకూడదనుకొన్నాను. మాట్లాడకుండా ఉండకూడదు కూడాను. 'సరే పోదాం పద' అంటే 'అమ్మా! నా మాట నమ్మావా లేదా?' అని అడిగింది నమ్మానని చెప్పాను. ఇద్దరం పార్కులో కూర్చున్నప్పుడు అడిగాను. 'శివా! శీనా నీకు అంతగా గుర్తుకు వస్తుంటాడా?'

'అవునమ్మా! గుర్తుకు రావటమేకాదు, రోజూ వస్తుంటాడు.'

'ఎక్కడికి?'

'మన ఇంటికి!'

'ఏ సమయంలో వస్తుంటాడు?'

'రాత్రి!'

'ఏమంటాడు?'

'మగాడు ఏమంటాడు?'

'ఏం చేస్తాడు?'

'ముద్దు పెట్టుకొంటాడు!'

'అంతేనా?'

'అబ్బో చాలా!'

ఇంటికి రాగానే నాచేయి పట్టుకొని తన పడక గదిలోకి తీసుకు పోయింది.

'రాత్రి వేసుకొన్న పైజామా ఈడే వదిలేసిపోయాడు చూడండి' అని మంచం మీద శీన పైజామా చూపించింది తీసి అలమరాలో ఉంచింది.

'తాను వచ్చి, నేను నిద్రలో ఉంటే లేపకుండా బట్టలు మార్చుకొని మౌనంగా నా మంచం మీద పడుకొంటాడు.'

'ఊఁ!'

'నేను మేల్కొంటే మాట్లాడిస్తాడు'

'ఊఁ'

'పోతూ రాత్రి నలిగిన బట్టలు ఇక్కడే వదిలి వెళిపోతాడు.'

నేను నమ్మనట్లు కనిపిస్తే బాధ పడుతుందని నమ్మినట్లుగా ముఖం పెట్టి కూర్చున్నాను.

'శివా! చిన్నదానివి! భర్త సుఖం కావాలని నీకు అన్పించదే?'

శివ నవ్వింది.

'శీనా వస్తే అంతకంటే ఏం సుఖం కావాలి'

అన్నం తిన్న తరువాత శివతో చెప్పాను. 'శివా! నేనేరాత్రి నీతో పడుకొంటాను!'

'నా మంచంమీద వద్దు!'

'ఏం?'

'శీనా వస్తాడు'

'మరి?'

'రెండో మంచం మీది!' నేను సరే నంటే తలనిండా పూలు పెట్టుకొన్న శివ తల ఊపింది. పూలు తైతక్కలాడాయి.

పడుకొన్న కొంచెం సేపటికే శివ నిద్రపోయింది. నాకు నిద్రపట్టలేదు. చాలా సేపు చదువుకొన్నాను. లైటు ఆర్పక పోయినా వది మొద్దు నిద్ర. కదలకుండా పడుకొంది. రాత్రంతా జాగారం చేశాను. మంచంమీదే కూర్చున్నాను. ఎప్పుడో మాగన్నుగా కళ్ళు మూతలు పడుతున్నట్లు అనిపించింది.

పక్క మంచం మీద పడుకొన్న శివ విపరీతంగా మంచంమీద కొట్టుకులాడుతూ వుంది.

నాకు మెలకువ వచ్చి, చూశాను. శివ సంచలించిపోతూ ఉంది. నేనామెను లేపలేదు.

తెల్లవారి నంక చూస్తే ఆమె మంచంమీద పైజామా ఉంది.

మొదటిరాత్రి, శోభనం అయిన పెళ్ళి కూతురు గది వెలుపలికి వస్తే ఎలా ఉంటుందో అలా వుంది శివ.